## క్లుప్తంగా

### వారపు సంతలో గేటు వసూలు చేస్తే చర్యలు

**పీలేరురూరల్ :** పీలేరు పట్టణంలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంతలో గేటు వసూలు చేస్తే చర్యలు తప్పవని సర్పంచ్ జీనవత్‌షఫీ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో సర్పంచ్ మాట్లాడుతూ పీలేరు వారపుసంత, దినసరి మార్కెట్, మాంసపు మార్కెట్‌లలో గేటుకు ఎంపీ మిథున్‌రెడ్డి సొంత నిధులు పంచాయతీకి చెల్లించడం జరిగిందన్నారు. ఇంకా రెండు నెలలు పాటు గడువు ఉందని, అప్పటి వరకు ఎలాంటి గేటు వసూలు చేయరాదని తెలిపారు. ఇప్పటికే వ్యాపారస్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, పంచాయతీ అనుమతి ఇచ్చే వరకు ఎవరైనా గేటు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఎన్నికల నియమావళి పాటించాలి

**తంబళ్లపల్లె :** సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయదలచిన అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. తంబళ్లపల్లె తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఈఆర్‌ఓ రాఘవేంద్ర తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఎస్.ఐ మధులు ఈఆర్‌ఓతో చర్చించారు. నామినేషన్ ప్రక్రియ సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

### 18 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా

**పీలేరు రూరల్ :** మండలంలో 18 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బోడుమల్లువారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో 18 మంది గ్రామవలంటీర్లు తమ రాజీనామ పత్రాలను పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్లు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవడానికే తాము రాజీనామా చేసినట్లు తెలిపారు.

### 22న ఉచిత మెగా వైద్య శిబిరం

**మదనపల్లె సిటీ :** స్థానిక సొసైటీకాలనీలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో ఈనెల 22న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ చైర్మన్ భాస్కర్‌నాయుడు తెలిపారు. శిబిరంలో కంటివైద్యంతో పాటు జనరల్, కిడ్నీ సంబంధించిన వైద్యులు చికిత్సలు అందిస్తారన్నారు.

### ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి

**పీలేరు :** మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ కొత్తపేటకు చెందిన రెడ్డెప్ప పీలేరు పట్టణంలో హమాలి యూనియన్ నాయకుడుగా ఉన్నారు. ఇటీవల ఆయన గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సిమెంట్ అండ్ స్టీల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి కొత్తపేటకు చేరుకుని మృతుని కుటుంబ సభ్యులకు రూ. 50 వేల ఆర్థిక సాయం అందించారు.

### వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



కొండయ్యగారి పల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న రెడ్డిశేఖర్‌రెడ్డి

**నిమ్మనపల్లె :** రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించడం కోసం రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను బలపరిచి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాశ్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కొండయ్య గారి పల్లె, గుడ్డిరెడ్డి గారిపల్లె, కొమ్మిరెడ్డి గారి పల్లె, తదితర గ్రామాల్లో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రచార కరపత్రాలను అందించారు. ప్రతిపక్షాల మాయ మాటలు నమ్మవద్దన్నారు. వాటర్‌షెడ్ చైర్మన్ నవీన్ కుమార్ రెడ్డి, నాయకులు శిధర్ రెడ్డి పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



గాయపడ్డ మనోహర్

**పీలేరు రూరల్ :** ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని పొంతల చెరువు క్రాస్ వద్ద చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. మండలంలోని కావలిపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన ఎం. మనోహర్ (25) ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి పొంతలచెరువుకు బయలుదేరాడు. పొంతలచెరువు క్రాస్ వద్ద వెనుకవైపు నుంచి ఇసుక ట్రాక్టర్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోహర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో మనోహర్‌ను చికిత్సనిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# పెద్దిరెడ్డిని ఢీ కొనేదెవరు..?

- వైఎస్సార్‌సీపీకి పటిష్టమైన పునాదులు, బలమైన క్యాడర్
- నియోజకవర్గంలో తనదైన ముద్ర



ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వెళుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి (ఫైల్)

**బి.కొత్తకోట :** తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని ఢీకొనే అభ్యర్థి ఎవరు అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. మే 13న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసేందుకు ద్వారకనాథరెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో తంబళ్లపల్లె నుంచి రెండోసారి బరిలో నిలిచారు. టీడీపీ నుంచి అభ్యర్థి ప్రకటన జరిగినా ఈ స్థానాన్ని పొత్తులో బీజేపీకి ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనితో అభ్యర్థి విషయంలో ప్రతిష్టంభన ఏర్పడింది. 2017 అగష్టు 4న నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారు. సమన్వయకర్తగా ప్రజలతో మమేకమై, ఎమ్మెల్యే అయ్యాక అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, సంక్షేమం, సమస్యల పరిష్కారంపై ఆయన తనదైన ముద్ర వేశారు. 2019కి మునుపు, ఆ తర్వాత అన్నట్టుగా అభివృద్ధి సాగింది. 1952లో తొలి నియోజకవర్గం గట్టు, 1957 నుంచి మొదలైన తంబళ్లపల్లె నియోజకవర్గ చరిత్రలో ఏ ఎమ్మెల్యేకు సాధ్యంకాని అభివృద్ధిని చేతల్లో చూపించిన ఘనత పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిది. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జి.శంకర్ యాదవ్‌పై ద్వారకనాథరెడ్డి 1,05,444 ఓట్లు సాధించారు. టీడీపీ అభ్యర్థి 58,506 ఓట్లు దక్కించుకోగా, 46,938 ఓట్ల మెజార్టీ సాధించి ఉమ్మడిచిత్తూరు జిల్లాలో అత్యధిక మెజార్టీ సాధించిన ఏకైక ఎమ్మెల్యేగా గుర్తింపు దక్కించుకున్నారు.

**ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరా..**

ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తీసుకురావడానికి ముందే తంబళ్లపల్లె నియోజకవర్గంలో రెండుసార్లు ఇంటింటి పర్యటనలను ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పూర్తి చేశారు. మూడోసారి ఇంటింటి పర్యటన కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలులోకి వచ్చింది. నియోజకవర్గంలోని ఆరు మండలాలు, ఒక నగర పంచాయతీ పరిధిలోని 1,200 పైచిలుకు పల్లెల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరా తీయడం, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులను ఆదేశించడం జరుగుతూ వచ్చింది.

**తప్పులపై బహిరంగ విన్నపం**

తన పనితీరులో తప్పులుంటే చెప్పాలని, వాటిని సరి చేసుకుంటానని ఏ ఎమ్మెల్యే అయినా బహిరంగంగా ప్రకటించడానికి సాహసించరు. అయితే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఈ విషయంలో గొప్పలకు పోలేదు. నియోజకవర్గంలో జరిగిన ప్రతిసభలోనూ..నాకు తెలిసో తెలియకో తప్పులు జరిగివుంటే, ధైర్యంగా చెప్పండి సరి చేసుకుంటా. నా వల్ల ఇబ్బంది కలిగివుంటే క్షమించండి అంటూ పదేపదే చెప్పడం ఆయన పారదర్శకతకు నిదర్శనంగా నిలిచింది.

**బలమైన పునాదులు**

జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి గట్టి పునాదులు ఏర్పడ్డాయి. సమన్వయకర్తగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బాధ్యతలు చేపట్టాక పార్టీ పటిష్టత, క్యాడర్‌లో ఉత్సాహం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. దీనితో ఉమ్మడిచిత్తూరులో పార్టీ పరంగా అత్యంత పటిష్టంగా ఉన్న నియోజకవర్గంగా తంబళ్లపల్లె అవతరించింది.

### నేడు నామినేషన్

**బి.కొత్తకోట :** వైఎస్సార్‌సీపీ తంబళ్లపల్లె అభ్యర్థిగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గురువారం తంబళ్లపల్లె తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. వాయల్పాడు నుంచి గుర్రంకొండ మీదుగా తంబళ్లపల్లె మండలంలోని కుక్కరాజుపల్లెకు చేరుకునే ఎమ్మెల్యే, అక్కడినుంచి పెద్దసంఖ్యలో హజరయ్యే పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా కోటకొండ, మఠం మీదుగా తంబళ్లపల్లె చేరుకుంటారు. అక్కడ పార్టీ శ్రేణులతో కలిసిన తర్వాత ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయం చేరుకుని రిటర్నింగ్ అధికారి ఎదుట నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తారు.

# నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

- సబ్ కలెక్టరేట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు
- ఉదయం 11 నుంచి 3 గంటల వరకు సమయం
- అభ్యర్థులు విధిగా నిబంధనలు పాటించాలి
- 25వతేదీ వరకు నామినేషన్ల స్వీకరణ




నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం చేసినట్లు తెలుపుతున్న ఆర్వో హరిప్రసాద్

**మదనపల్లె :** ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కానున్నది. 164-మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లు సబ్ కలెక్టరేట్‌లో స్వీకరించనున్నారు. సబ్ కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశారు. సీసీ కెమెరాలు అమర్చారు. గురువారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు సబ్ కలెక్టరేట్‌లో ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈమేరకు సబ్‌కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. నామినేషన్లు స్వీకరించే సబ్ కలెక్టరేట్‌కు 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థుల అనుచరులను నిలిపివేసేందుకు మదనపల్లె-చిత్తూరు ప్రధాన రహదారిపై అధికారులు ప్రత్యేకంగా మార్కింగ్ ఏర్పాటు చేశారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు మూడు వాహనాల్లో మాత్రమే రావాల్సి ఉంటుందని, వాటిని ఆర్వో రూముకు 100 మీటర్ల దూరంలోనే నిలిపివేసి, నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే లోనికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వనున్నారు. నామినేషన్లు స్వీకరించే గదిలో 360 డిగ్రీల కోణంలో పనిచేసే సీసీ కెమెరాలతో... అభ్యర్థులు లోనికి వచ్చి, నామినేషన్లు సమర్పించి, తిరిగి వెళ్లేంతవరకు ప్రతిదీ రికార్డు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సబ్ కలెక్టరేట్‌లో ఎన్నికల కంట్రోల్ రూమ్, వివిధ అనుమతుల మంజూరు కోసం సువిధ సెల్, ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఎక్స్‌పెండిచర్ సెల్, అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర నిఘా పెట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. అంతేకాకుండా నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించేందుకు అధికారులను సిద్ధంగా ఉంచారు. అభ్యర్థుల నామినేషన్లను మదనపల్లె నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్ స్వీకరించనున్నారు.

**నామినేషన్ల స్వీకరణకు నేడు గెజిట్ నోటిఫికేషన్**

ఈ సందర్భంగా బుధవారం సబ్‌కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్వో హరిప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. నామినేషన్ల స్వీకరణకు గెజిట్ నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల అవుతుందని స్పష్టం చేశారు. ఈనెల 18 నుంచి 25 వరకు ప్రభుత్వ సెలవులు మినహాయించి, కార్యాలయ పనివేళల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థులు విధిగా సమయపాలన పాటించాలని, సమయం ముగిసిన తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ నామినేషన్లు స్వీకరించడం జరగదన్నారు. ఈనెల 26న నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. 29వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం అభ్యర్థులకు ఉందన్నారు. మే 12న పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, పోలింగ్ సామగ్రి అందజేసి, ముందుగా నిర్ణయించిన రూట్‌మ్యాప్ మేరకు ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని వాహనాల్లో తరలించనున్నట్లు తెలిపారు. మే 13న ఉదయం 7 నుంచి 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో గతంలో కన్నా ఓటింగ్‌శాతాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

# ప్రతి ఒక్కరూ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

**కలికిరి :** ఎన్నికలకు కొన్ని రోజులో గడువున్నందున ప్రతి నాయకుడు, కార్యకర్త వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టపడి గెలుపే లక్ష్యంగా పని చేయాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పారపట్ల గ్రామంలో బుధవారం ఉదయం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలతీతంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ హయాంలో మంచి జరిగిందని, ప్రతి ఓటరును కలిసి వైఎస్సార్‌సీపీకి ఓటు అభ్యర్థించాలన్నారు. కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తప్పనిసరిగా తగిన గుర్తింపు ఉంటుందన్నారు. నియోజకవర్గంలో గెలుపుఓటములకు సంబంధంలేకుండా నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నాని, రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన నల్లారి సోదరులు కోవిడ్ కష్టకాలంలో నియోజకవర్గ ప్రజల బాగోగులను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నియోజకవర్గానికి రాలేదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడటంతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి మరింత గ్రాఫ్ పెరిగిందని పేర్కొన్నారు. విపత్కర కాలంలో ప్రజలకు అండగా ఉండి వారి ఆరోగ్య పరిస్థితులపై నిత్యం పర్యవేక్షించి సహాయం చేయగలిగామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆఘామొహిద్దీన్, మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు సీకాం సురేంద్రనాథ రెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, మురళీనాథరెడ్డి, శ్రీకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాహుల్ చక్రవర్తిరెడ్డి, ఎస్టీడి హరి, మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ వెంకటరమణ, మహేంద్రరెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సి.ఓబుల్‌రెడ్డి, శివాజీ, శ్రీనివాసులురెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ శాంతియుతంగా మెలగాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

**గుర్రంకొండ :** ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా మెలగాలని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని నడిమికండ్రిగ, గెరికుంటపల్లె, చెర్లోపల్లె గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గ్రామస్తులు శాంతియుతంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనవసరమైన ఘర్షణలకు దిగవద్దన్నారు. శాంతియుత వాతావరణానికి భంగంగ కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామన్నారు. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఇందు కోసం పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకిపురం సిఐ శేఖర్, ఎస్ఐలు నాగార్జునరెడ్డి, శ్రీనివాసనాయక్, ఏఎస్ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

**కేవీపల్లె :** గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్‌టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా ప్రవేశ పరీక్ష కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8వ తరగతుల ప్రవేశానికి ఈ నెల 25 ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. అలాగే అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

# ప్రజల ఆశీస్సులతో గెలుపు వైఎస్సార్ సీపీదే

- ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్
- ఈశ్వరమ్మకాలనీ, సైదాపేట, అప్పారావుతోటలో విస్తృత ప్రచారం



వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

**మదనపల్లె :** వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. మండలంలోని ఈశ్వరమ్మకాలనీ, పట్టణంలోని సైదాపేట, అప్పారావుతోటలో బుధవారం మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం.రెడ్డెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గట్టిగా కోరుకుంటున్నారని, మళ్లీ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఓటు వేయడం మీ పని... అభివృద్ధి చేయడం మా పని అంటూ ప్రచారం చేస్తుంటే ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపిస్తోందన్నారు. సంక్షేమ పథకాలను ఇంటివద్దకే చేర్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి వైఎస్సార్ సీపీ ఓటువేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డిమిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వెలుగుచంద్ర, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, డాక్టర్.అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ బి.ఎ.ఖాజా, సలీం, ఇస్మాయిల్, సర్పంచ్ మధు, ఇర్ఫాన్, జేసీఎస్ కన్వీనర్లు బావాజీ, మునిశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ నాయకుల చేరిక :**

ఈశ్వరమ్మకాలనీలో జరిగిన వైఎస్సార్ సీపీ ప్రచార కార్యక్రమంలో సర్పంచ్ ఎం.రెడ్డెమ్మ, శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకులు గంగారపు నరేంద్రనాయుడు, చంద్రనాయుడు వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ బస్రి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జునరెడ్డి, మాజీ కోఆప్షన్ ఇస్మాయిల్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

### 25న లక్కీడిప్ డ్రా

**మదనపల్లె సిటీ :** మదనపల్లె-బి.కొత్తకోట మార్గంలో ఈనెల 25న లక్కీడిప్ డ్రా తీయనున్నట్టు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ రూటులో ప్రయాణించిన ప్రయాణికులు టిక్కెట్టు వెనుకవైపున పేరు, మొబైల్ నంబర్,ఊరు పేరు రాసి బస్సులోని గిఫ్ట్ బాక్సులో వేయాలని కోరారు.

### వంట గ్యాస్ వినియోగంపై అవగాహన

**ములకలచెరువు :** వంట గ్యాస్ వినియోగించే మహిళలు మెలకువలు పాటించాలని ఫైర్ అధికారి క్రిష్ణయ్య సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మహిళలతో వంటగ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి మాట్లాడుతూ వంట గదిలోకి గాలి బాగా వచ్చేలా చూసుకోవాలన్నారు.

### ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను మరోసారి గెలిపించండి



ఎన్నికల ప్రచారంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

**పీలేరు రూరల్ :** రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి కోరారు. బుధవారం పీలేరు పట్టణంలోని యర్రమరెడ్డి గుట్ట తదితర ప్రాంతాలలో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. పీలేరులో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, పార్కు, ఆర్‌వోబీ నిర్మాణాలు, బైపాస్ రోడ్డు, అన్ని మతాలకు వేర్వేరుగా స్మశాన వాటికలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే పేదలకు 15 వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే మళ్ళీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ జీనత్‌షఫీ, వైస్ ఎంపీపీ ఎస్.వి. చలపతి, ఎంపీటీసీ అనుశ్రీ, జవహార్, వార్డు మెంబర్లు కళావతి, పరమేష్, నాయకులు ఎ.ఎస్. హుమయూన్, శ్రీనాథరెడ్డి, జయపాల్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, చైతన్యరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, చక్రధర్, జావిద్, షాకీర్, అబీద్, అభిషేక్, దేవేంద్ర, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా సీతారాముల కల్యాణోత్సవం

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో నవమి ఉత్సవాలు
- పానకం, వడపప్పు పంపిణీ



మదనపల్లె : అమినేనివీధిలో సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు



కలకడ : నడిమిచెర్ల రామాలయంలో సీతారాముల కళ్యాణం

**మదనపల్లె సిటీ :** శ్రీరామనవమి ఉత్సవాలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మదనపల్లె పట్టణంలో బుధవారం శ్రీరామనవమి ఉత్సవాలు స్థానిక సొసైటీకాలనీ కోదండరామస్వామి ఆలయంలో ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, హోమం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గురువారం కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక అమినేనివీధిలోని రామాలయంలో అర్చకులు రమేష్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు కళ్యాణం తిలకించి పునీతులయ్యారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భవానీప్రసాద్, కౌన్సిలర్ గిరిజా, సాయిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం ఆలయ ప్రాంగణంలో స్వామి ఉత్సవ విగ్రహాలకు అర్చకులు శివస్వామి పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కోళ్లబైలు పంచాయతీలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.నిస్సార్‌అహ్మద్ పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

**రామసముద్రంలో..**

**రామసముద్రం :** మండలంలోని చెంబకూరు ఆర్.నడింపల్లె, జంగాలపల్లి, ఎర్రబోయినపల్లె, రామసముద్రం బజారువీధి, తదితర గ్రామాల్లో వెలసిన రామాలయాల్లో నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాల వద్ద పానకం, వడపప్పులు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయాల వద్ద సీతారాముల కళ్యాణం నిర్వహించారు.

**గుర్రంకొండలో..**

**గుర్రంకొండ :** గుర్రంకొండలోని కొత్తపేట, బలిజగడ్డ వీధుల్లో ఉన్న శ్రీ కోదండ రామస్వామి ఆలయాల్లో స్వామివారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారికి ఘనంగా పూజలు చేశారు నిర్వాహకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

**కేవీపల్లెలో..**

**కేవీపల్లె :** కేవీపల్లె రామాలయంలో సీతారామలక్ష్మణ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు కల్యాణం తిలకించారు.

**కలకడలో..**

**కలకడ :** శ్రీరామనవమి సందర్భంగా బుధవారం మండలంలోని అన్ని రామాలయాలలో నవమి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నడిమిచెర్ల, గువ్వలవారిపల్లె ఆలయాలలో శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం వైభగంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

**తంబళ్లపల్లెలో..**

**తంబళ్లపల్లె :** మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో టీఎస్ కుటంబీకుల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు జరిపారు. స్వామిని ప్రత్యేక అలంరణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు బెల్లంపానకం, మజ్జిగ,వడపప్పు పంపిణీ చేశారు.

**ములకలచెరువులో..**

**ములకలచెరువు :** మండలంలోని ములకలచెరువు, బురకాయలకోట, వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లెలో వెలసిన శ్రీ రామాలయాల్లో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా నిర్వాహకులు సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. పండితులు వేధ మంత్రాలతో కళ్యాణోత్సవం జరిపించారు.

**కలికిరిలో..**

**కలికిరి :** పట్టణ పరిధిలోని గుండం వద్ద రామాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, శ్రీసీతారాముల కళ్యాణోత్సవం, క్రాస్ రోడ్డులోని రామాలయంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం అనంతరం ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు.

**నిమ్మనపల్లెలో..**

**నిమ్మనపల్లె :** మండలంలోని రామాలయాలలో సీతారామాంజనేయ ఉత్సవ విగ్రహాలకు విశేష అలంకరణ చేశారు. నిమ్మనపల్లి, అగ్రహారం, బాలినాయనపల్లె, మండ్యంవారిపల్లె, వెంకోజీగారిపల్లెలో నవమి వేడుకలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను, వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

**కురుబలకోటలో..**

**కురబలకోట :** శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని వివిధ రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అంగళ్లు గ్రామంలోని పోరెడ్డివారిపల్లె, కమతంపల్లె, మొలకవారిపల్లె, తుమ్మచెట్లపల్లెలో స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

**బి.కొత్తకోటలో..**

**బి.కొత్తకోట :** శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం మండలంలో సీతారాముల కళ్యాణం కమనీయంగా సాగింది. స్థానిక పోకనాటివీధి, ఆర్యవైశ్య బజారులో సీతారాముల కళ్యాణోత్సవ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.